

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఉన్న విత్తనాల దుకాణం ఎదుట శుక్రవారం బారులు తీరిన రైతులు

## కనికరించండి.. రుణమాఫీ చేయండి

### కలెక్టర్‌కు రెంజల్ రైతుల విన్నపం

రెంజల్. ఆగస్టు 9: అర్హులమైన తమకు రుణమాఫీ కాలేదని, కనికరించి రుణాలు మాఫీ చేయాలని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల రైతులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం పలువురు రైతులు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రూ.లక్షన్నర లోపు పంట రుణాలను మాఫీ చేయగా.. కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో మాఫీ వర్తించలేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ మాఫీ కాని రైతుల జాబితాను రెండ్రోజుల్లో సమర్పించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు.

## రుణం మాఫీ కాలే.. పింఛన్ రాలే

- సెల్‌టవర్ ఎక్కి యువకుడి నిరసన

వైరా రూరల్, ఆగస్టు 9: ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తున్న కాంగ్రెస్ సర్కారు.. తమ భూమిపై ఉన్న రూ.88 వేల రుణాన్ని మాఫీ చేయలేదని, 68 ఏండ్ల తన తండ్రికి ఆసరా పింఛన్ కూడా ఇవ్వడం లేదని ఓ యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం తమ గ్రామానికి వస్తున్నట్టు తెలుసుకున్న ఆ యువకుడు గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వైరా మండలంలో జరిగింది. వైరా మండలం కేజీ సిరిపురం గ్రామానికి చెందిన నారపోగు నాగకృష్ణ.. తండ్రి నారపోగు భిక్షం పింఛన్ కోసం అనేకసార్లు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. అలాగే వారి 1.20 ఎకరాల వ్యవసాయ భూమిపై ఉన్న రూ.88 వేల పంట రుణం మాఫీ కాలేదు. తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాడు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఉప ముఖ్యమంత్రే తమ గ్రామానికి వస్తున్నట్టు తెలుసుకుని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. స్వయంగా డిప్యూటీ సీఎం వచ్చి తమ సమస్యను పరిష్కరిస్తేనే తాను ఈ టవర్ దిగుతానని స్పష్టంచేశాడు. దీంతో స్థానిక మాజీ ఎంపీటీసీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంటనే సెల్ టవర్ వద్దకు చేరుకుని 'నీ సమస్యను డిప్యూటీ సీఎంకు తెలియజేస్తాం. 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం' అని హామీ ఇవ్వడంతో ఆ యువకుడు సెల్ టవర్ దిగాడు.


సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు నాగకృష్ణ


పిట్టల సారయ్య దంపతులు

## రుణమాఫీ పైసలు బాకీ కింద తీసుకున్నరు

- వారం తిప్పకుని ఇవ్వలేమంటున్న బ్యాంకు అధికారులు
- వడ్డీ కట్టేందుకు మళ్లీ అప్పు చేశామన్న రైతు దంపతులు

టేకుమట్ల, ఆగస్టు 9: రుణమాఫీ డబ్బులు తప్పకుండా రైతులకే ఇవ్వాలని, పాత బకాయిల కింద ఆపొద్దని ప్రభుత్వం చెప్తున్నా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ అధికారులు ససేమిరా అంటున్నారు. మహిళా సంఘంలో ఉన్న అప్పు కింద రుణమాఫీ డబ్బులు పట్టుకుని రైతు దంపతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లికి చెందిన పిట్టల సారయ్య దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మాకు ప్రభుత్వం రూ.48 వేల రుణం మాఫీ చేసినట్టు లిస్టులో పేరు వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే.. 'వడ్డీ రూ.6 వేలు అయింది. కట్టాలంటే అప్పు తెచ్చి కట్టినం. మాఫీ పైసలు మా అకౌంట్‌లో వేస్తామని చెప్పారు. వారం రోజులు తిప్పించుకున్నరు. తీరా ఇప్పుడు బ్యాంకులో డబ్బులు లేవు బయట తీసుకోండని చెప్పారు. బయట తీసుకునేందుకు వెళ్తే అకౌంట్ బ్లాక్ అయిందంటున్నారు. మళ్లీ ఏపీజీవీబీకి వెళ్లి డబ్బులు అడిగితే.. మీ భార్య మహిళా సంఘంలో అప్పు తీసుకుంది. అవి కడితేనే ఇస్తాం. లేకుంటే ఇవ్వం' అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇప్పుడు రూ.20 వేలు ఆపుకోండి, మిగితావి నెలనెలా కడుతాం' అని ఎంత వేడుకున్నా డబ్బులు ఇస్తలేరని, వడ్డీకి తెచ్చిన అప్పు తీర్చకుంటే పరువు పోతుందని రైతు దంపతులు విలపిస్తున్నారు.

- శ్మశానవాటిక స్థలం కబ్జా చేశారని దళితుల ధర్నా


**మహబూబాబాద్** జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని తమ శ్మశానవాటిక స్థలాన్ని మాజీ సర్పంచ్, ఆయన మనుమడు ఆక్రమించి పట్టా చేసుకున్నారంటూ దళితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదేమని అడిగితే 11 మంది దళితులకు కోర్టు నోటీసులు పంపించారని దళిత నాయకుడు గుజ్జునూరి బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. **- ఇనుగుర్తి**

- పాడి రైతుల ధర్నా



**పెండింగ్** పాల బిల్లులు చెల్లించాలని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం విజయ డెయిరీ రైతులు ధర్నా చేశారు. డెయిరీ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన రైతులు పాల డబ్బాలతో రాస్తారోకో చేయడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించి ధర్నాను విరమింప జేశారు. **- స్టేషన్ ఘన్‌పూర్**

- సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితుల నిరసన


**ఆదిలాబాద్** జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి గ్రామ శివారులో నిర్మించనున్న రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ కోసం భూములివ్వాలంటే ఎకరానికి రూ.50 లక్షలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. **– ఎదులాపురం**


## బీసీ యువతకు ఉపాధి శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు9 (నమస్తే తెలంగాణ): బీసీ నిరుద్యోగ యువతకు ఎల్జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100మంది అభ్యర్థులను ఎంపిక చేసి 3నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. రూ.4వేల ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు. 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040–24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదు

- అధికారులు, లీడ్ బ్యాంకర్లపై ఎమ్మెల్యే కడియం ఫైర్
- రుణమాఫీ సాంకేతిక సమస్యపై కలెక్టరేట్‌లో సమీక్ష

జనగామ, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): 'ఒకే మండలంలో 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వారంతా ఆందోళనలో ఉన్నారు. మేం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకంపై పర్యవేక్షణ సరిగా లేదు. మీ వల్ల ప్రభు త్వం బద్నాం కావాలా?' అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లీడ్‌బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.శుక్రవారం జనగామ కలెక్టరేట్‌లో లింగాలఘనపురం మండలం నెల్లుట్ల, నవాబ్‌పేట గ్రామాల రైతుల రుణమాఫీలో తలెత్తిన సాంకేతిక సమస్యపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, లీడ్‌బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో కలిసి సమీక్షించారు. తన నియోజకవర్గ పరిధిలోని నవాబ్‌పేటకు చెందిన 800 మంది, నెల్లుట్లకు చెందిన సుమారు 400 మంది రైతులకు కెనరా బ్యాంక్ ద్వారా రుణ మాఫీ కాలేదని, దీనికి ఎవరు బాధ్యులు అని కడియం మండిపడ్డారు.'మీపర్యవేక్షణ లోపం వల్ల మేం బద్నాం కావాలా?' అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.




ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో వినతి పత్రాలతో భారీగా తరలివచ్చిన ప్రజలు

## పరిష్కారంలేని 'ప్రజాపాలన?

- డిసెంబర్‌లో దరఖాస్తుల స్వీకరణ
- భారీగా అప్లికేషన్లు గాయబ్
- అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకోటకు చెందిన తోటపల్లి రవికుమార్ జనవరి 3న 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు వర్తింపజేయాలని కోరారు. అధికారులు రసీదు ఇచ్చారు. అయినా ఏ పథకం ఆయనకు వర్తించలేదు. అధికారులను అడిగితే తమకు వివరాలు అందలేదని చెప్పారు. మండల కార్యాలయానికి వెళితే ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని చెప్పేశారు.అధికారుల చుట్టూ తిరిగి వేసారిన ఆయన హైదరాబాద్ ప్రజాభవన్ ప్రజావాణిలోనూ ఫిర్యాదులు చేశారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

### భారీగా దరఖాస్తులు మిస్సింగ్

ప్రజాపాలన దరఖాస్తులను ప్రభుత్వం గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు తీసుకున్నది. 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరుసటిరోజు నుంచే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభించారు. 1.25 కోట్ల దరఖాస్తుల డాటా ఎంట్రీకి ప్రభుత్వం 10 రోజుల సమయమే ఇచ్చింది. కొన్నిచోట్ల దరఖాస్తులను ఇండ్లకు పంపించి డాటా ఎంట్రీ చేయించారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో బైక్‌పై తీసుకెళ్తుండగా పత్రాలన్నీ రోడ్డుపై పడిపోయాయి. 12వ తేదీకే డాటా ఎంట్రీ పూర్తయినట్టు అధికారులు ప్రకటించారు. ప్రత్యేకంగా వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి ఒకటిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించగా అధికారులు 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 2.82 లక్షల దరఖాస్తులకు ఆధార్, రేషన్ నంబర్ జతచేయలేదని, వివరాలు తప్పుగా రాశారని చెప్పారు. వీటిని కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, అర్హులైతే పథకాలు వర్తింపజేయాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తుల సంఖ్య 1.25 కోట్ల నుంచి 1.09 కోట్లకు పడిపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నకిలీ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నా.. సుమారు 13 లక్షల అప్లికేషన్లు తగ్గాయి.

### వివరాలన్నీ గుట్టుగా..

ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం మొదటి నుంచీ వివరాలు వెల్లడించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజాపాలన ఆధారంగా గృహలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంత మందికి అమలు చేస్తున్నారు? వంటి వివరాలేవీ బహిర్గతం చేయడం లేదని చెప్తున్నారు. దరఖాస్తులకు, అమలుకు మధ్య భారీగా వ్యత్యాసం ఉండటం వల్లే దాచిపెడుతున్నారని విమర్శిస్తున్నారు.

### దరఖాస్తు నమోదు కాలేదు

ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, రూ.500కే ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభించినా వర్తించకపోవడంతో బాధితులు విద్యుత్తు గ్యాస్ కార్యాలయాలకు పరుగులు తీశారు. అధికారులు వెబ్ పోర్టల్‌లో తనిఖీ చేసి 'మీ పేరు లేదు' అంటూ సమాధానం ఇచ్చారు. మండల కార్యాలయాలకు వెళ్లినా అదే సమాధానం. అప్పటినుంచి బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మండల స్థాయి నుంచి ప్రజాభవన్ వరకు ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చినా పరిష్కారం కావడంలేదని చెప్తున్నారు.

### నాలుగు నెలలన్నారు.. ఊసే లేదు

ప్రజాపాలన దరఖాస్తులు 'ప్రతి నాలుగు నెలలకు ఒకసారి దరఖాస్తులు స్వీకరిస్తాం' అని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు పెడతామని ఆర్భాటంగా చెప్పింది. ఇప్పటికి ఏడు నెలలు గడిచిపోయినా రెండో దఫా దరఖాస్తుల స్వీకరణ ఊసెత్తడం లేదు. మొదటి దఫా దరఖాస్తులు చేసుకున్నా నమోదు కానివారు, అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయినవారు రెండో అవకాశం కోసం ఎదు రు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండో దఫా దరఖాస్తులు ప్రారంభించాలని కోరుతున్నారు.

## ప్రవాసంలో సర్కార్.. ప్రయాసలో పాలన

- అమెరికాలో సీఎం రేవంత్,సీఎస్, మంత్రులు
- రాష్ట్రంలో వర్షాలు, జ్వరాలు, సమస్యలు
- రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు, రైతులు
- పడకేసిన పాలన.. ఎక్కడికక్కడే ఫైళ్లు
- తిరిగొచ్చాకే పాలనాపరమైన నిర్ణయాలు

హత్యలు, లైంగికదాడులు.. పంజా విసురుతున్న విషజ్వరాలు! వానలు పడి కొన్నిచోట్లా ప్రమాదకరస్థాయికి వరదలు, మరికొన్నిచోట్లా కరువుఛాయలు. సుంకిశాల లాంటి నిర్వహణా వైఫల్యాలు. గురుకులాల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు! రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు! దిక్కుతోచని స్థితిలో రైతాంగం! రగులుతున్న ఉద్యోగులు! ఇదీ రాష్ట్రంలో పరిస్థితి.

ప్రభుత్వం మాత్రం ప్రవాసంలో ఉన్నది. సీఎం సహా సీఎస్, మంత్రులు అమెరికా పర్యటనలో ఉన్నారు. కీలక శాఖల ఉన్నతాధికారులూ అక్కడే ఉన్నారు. రాష్ట్రంలో పాలన పడకేసింది. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకునేవారు లేక ఫైళ్లు మూల్గుతున్నాయి. రెండు వారాలపాటు ఇదే పరిస్థితి.

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాలన పడకేసిందా? అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. కీలక అధికారులు, మంత్రులందరూ విదేశీ పర్యటనలో ఉండడంతో రాష్ట్రంలో పాలన అటకెక్కింది. నిన్నమొన్నటి వరకు ఢిల్లీకి వెళ్లిరావడంతోనే ముఖ్యమంత్రి, మంత్రులకు సరిపోయేది. వారానికి ఒక్కసారి ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ పర్యటనలకు వెళ్లేవారు. ఇప్పుడు సీఎం సహా కీలక మంత్రులు, అధికారులు అమెరికా బాటపట్టారు. రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు, వరదలు.. మరోవైపు హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్ల లొల్లి జరుగుతున్నది. ఇదంతా ఒకెత్తయితే అనేక శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీల ప్రహసనం సాగుతున్నది. ఇలాంటి కీలక సమయంలో సీఎం సహా అందరూ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఒకేసారి ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రం దాటి వెళ్లడం ఉండదు. ఇప్పుడు వీరెవరూ రాష్ట్రంలో లేకపోవడంతో ముఖ్యమైన నిర్ణయాలు ఎవరు తీసుకుంటారన్న ప్రశ్న ఎదురవుతున్నది. ముఖ్యమంత్రి అయిన 8 నెలల్లోనే రెండుసార్లు విదేశీ పర్యటన చేసిన రికార్డు రేవంత్‌కే దక్కుతుందని చెప్తున్నారు.


న్యూయార్క్‌లో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి (ఫైల్)

### వెళ్లింది వీరే..

శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే గత శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాకు బయల్దేరి వెళ్లారు. ఆ తర్వాత మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అమెరికా బాటపట్టారు. త్వరలోనే మరో మంత్రి దామోదర రాజనర్సింహ కూడా అమెరికా వెళ్తున్నారని సమాచారం. ముఖ్యమంత్రి తాను వెళ్లడమే కాకుండా తనతోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను వెంటపెట్టుకెళ్లారు. పరిశ్రమలశాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో అధికారులు శేషాద్రి, అజిత్‌రెడ్డి తదితరులుకూడా వెళ్లారు.

### అమెరికా పర్యటనలో సీఎస్ కూడా!

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా సీఎంతో అమెరికా పర్యటనకు వెళ్లారు. గతంలో ఎన్నడూ ఈ తరహాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎంతో విదేశీ పర్యటనలకు వెళ్లిన సందర్భాలు లేవు. సీఎం రాష్ట్రంలో లేని సమయంలో అత్యవసర అంశాలను హ్యాండిల్ చేయడం, యంత్రాంగానికి సంబంధించి నిర్ణయాలను తీసుకోవడం సీఎస్ విధి. కేంద్రంలో ప్రధాని లేని సమయంలో క్యాబినెట్ సెక్రటరీ ఆ విధులను పర్యవేక్షిస్తారు. సీఎస్ వెళ్తే ఆ స్థానంలో మరో అధికారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రోజువారీ కార్యకలాపాలను అమెరికా నుంచే సీఎస్ పర్యవేక్షిస్తున్నారు. రోజువారీగా చూడాల్సిన ఫైళ్లు, ఇవ్వాల్సిన సూచనలు, సమావేశాలు సీఎస్ తిరిగి వచ్చేవరకు నిలిపివేసినట్టే. చీఫ్ సెక్రటరీ తర్వాత ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పోస్టు కీలకమైంది. ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో అటు సీఎస్ వద్ద, ఇటు ఆర్థికశాఖలో అనేక ఫైళ్లు నిలిచిపోయినట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయం వద్ద ప్రతీ రోజు వందలాది మంది ఉద్యోగులు, చిన్న చిన్న కాంట్రాక్టర్లు తమ బిల్లులను విడుదల చేయించుకోవడానికి వేచి ఉంటున్న పరిస్థితి కనిపిస్తున్నది. మరో వారం రోజులపాటు అధికారుల విదేశీ పర్యటనలున్నాయి. వాళ్లు వచ్చేవరకు ఇదే విధమైన పరిస్థితి ఉంటుందని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

## మా భూములు ఇవ్వాలని రేవంత్ బెదిరింపు

మొదటిపేజీ తరువాయి...

బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరని అండగా నిలవాలని కేటీఆర్‌ను కోరారు. రూ.కోట్ల విలువ చేసే భూములను అప్పనంగా ప్రభుత్వం లాక్కునేందుకు కుట్ర చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. తమ కుటుంబాలకు ఈ భూమి జీవనాధారం అని, వీటిని గుంజుకుంటే జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,మహిపాల్ ముదిరాజ్ తదితరులు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

### సీఎం అల్లుడి కంపెనీ కోసమేనా?: బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

కొడంగల్‌లో ఫార్మా కంపెనీలకు 3వేల ఎకరాల భూ సమీకరణపై బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అనుమానం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే భూములను గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'ఏ ఫార్మా కంపెనీ కోసం కొడంగల్‌లో రైతులపై దాడులు చేస్తున్నారు? ఎనుముల ఇంటి అల్లుడికి చెందిన మాక్స్‌బిన్ ఫార్మా కోసమేనా?' అని శుక్రవారం ఎక్స్ వేదికగా క్రిశాంక్ ప్రశ్నించారు. కంపెనీకి చెందిన వివరాలను జత చేశారు.


గర్భిణి దర్మబాయిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

## ఆదివాసీ ప్రసవ వేదన

### వాగుకు అటు అంబులెన్స్.. ఇటు గర్భిణి

### కవలల్లో ఒకరి మృతి.. మరొకరి జననం

**కుమ్రంభీం** ఆసిఫాబాద్ జిల్లాలో వెంకటాపూర్ పరిధిలోని టిమ్రన్ మోవాడ్ బండగూడకు చెందిన దర్మబాయికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. వాగుపై వంతెన లేక ఒడ్డుపైనే అంబులెన్స్ ఆగింది. 7 నెలల గర్భిణీ దర్మబాయ్ కిలోమీటరున్నర నడుచి వాగు దాటింది. నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్ సిబ్బంది ప్రసవం చేశారు. ఆడ శిశువుకు జన్మనివ్వగా, గర్భంలో మరో శిశువు ఉందని అంబులెన్స్ సిబ్బంది ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా శిశువు మరణించింది. వైద్యులు మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించగా దర్మబాయి మరో పాపకు జన్మనిచ్చింది. ఆదివాసీ దినోత్సవం రోజే ఆదివాసీ గర్భిణి ప్రసవ వేదన కలిచివేసింది. **- ఆసిఫాబాద్ టౌన్**

## రోగికి గడువు తీరిన సెలైన్

### ఖానాపూర్ ప్రభుత్వ దవాఖాన సిబ్బందిపై రోగుల ఆగ్రహం

ఖానాపూర్ టౌన్, ఆగస్టు 9: ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగికి శుక్రవారం వైద్య సిబ్బంది గడువు ముగిసిన సెలైన్ బాటిల్‌ను ఎక్కించారు. నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్‌కు చెందిన అజారుద్దీన్ జ్వరంతో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు సెలైన్ బాటిల్ పెట్టారు. అతనితో వచ్చిన తమ్ముడు సెలైన్ బాటిల్‌పై ఎక్స్‌పైరీ తేదీ మార్చి 2024 ఉండడం చూసి వెంటనే వైద్యుల దృష్టికి తీసుకెళ్లాడు. నర్సు వచ్చి ఆ సెలైన్ బాటిల్ తీసేసి మరో సెలైన్ ఎక్కించింది. దవాఖానలో గడువు తీరిన మందులు కనిపించడంతో రోగులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సింగ్ అధికారి వాటిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను వివరణ కోరగా సెలైన్‌లో 2 ఎంఎల్ మాత్రమే రోగిగి ఎక్కిందని వెంటనే తొలగించినట్టు తెలిపారు. బాధ్యులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.



ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో రోగికి పెట్టిన గడువు తీరిన సెలైన్ బాటిల్